# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

# Bullet Edition

మంగళవారం 15 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com **2 pm**

## విమానంలో వృద్ధుడికి సీపీఆర్

### ప్రాణం కాపాడిన మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి

### ల్యాండింగ్ అనంతరం ఆసుపత్రికి తరలింపు





హైదరాబాద్ : విమాన ప్రయాణంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వృద్ధుడి ప్రాణాలను మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతి రెడ్డి సమయస్ఫూర్తితో కాపాడారు. శనివారం రాత్రి ఇండిగో విమానంలో జరిగిన ఈ సంఘటనలో, ఆమె చేసిన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) వృద్ధుడికి పునర్జన్మనిచ్చింది. శనివారం అర్ధరాత్రి ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో, 74 ఏళ్ల వయసున్న ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఆయన అపస్మారక స్థితిలోకి జారుకోవడంతో పాటు, నోటి నుంచి ద్రవం బయటకు రావడం ప్రారంభమైంది. దీంతో తోటి ప్రయాణికులు, విమాన సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ప్రీతి రెడ్డి ఈ పరిస్థితిని గమనించి తక్షణమే స్పందించారు. వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె, ఆ వృద్ధుడిని ప్రాథమికంగా పరీక్షించారు. ఆయన రక్తపోటు (బీపీ) బాగా తగ్గిపోయిందని నిర్ధారించుకున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే సీపీఆర్ ప్రక్రియను ప్రారంభించారు. కొంత సమయం పాటు ఆమె చేసిన ప్రయత్నం ఫలించి, వృద్ధుడి పరిస్థితి కొంత మెరుగుపడింది. విమానం ల్యాండ్ అయిన వెంటనే, విమానాశ్రయ సిబ్బంది ఆ వృద్ధుడిని మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## 100 రోజులు..

# ఆరు ప్లాట్ ఫాంలు

సికింద్రాబాద్ : సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పనులలో భాగంగా ఆరు ప్లాట్ ఫాంలు మూసివేశారు. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరించేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ ఆధునీకరణలో భాగంగా, సికింద్రాబాద్ స్టేషన్‌లోని 6 ప్లాట్‌ఫామ్‌లను 100 రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ కారణంగా 120 జతల రైళ్ల రూట్‌లను చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు మళ్లిస్తున్నారు. ముఖ్యంగా, చర్లపల్లి నుంచి ఎక్కువ రైళ్లు నడపనున్నట్లు మొదలు పెట్టారు. ఈ ప్రాజెక్టులో భాగంగా స్టేషన్‌లో రెండస్తుల భారీ స్కై కాంకోర్స్ నిర్మించబోతున్నట్లు సమాచారం. ఈ కాంకోర్స్‌లో ప్రయాణికుల కోసం అన్ని సౌకర్యాలుఅంటే.. రెస్టారెంట్లు, కియోస్క్‌లు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు అలా అన్ని స్కై కాంకోర్స్‌కు అనుసంధానంగా ఉండేలా ప్రణాళికలు చేపట్టనున్నారు.

**సికింద్రాబాద్‌లో ఆధునీకరణ పనులు**

**ఈ ప్లాట్ ఫాంలు క్లోజ్**

**చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లికి పలు రైళ్ల మళ్లింపు**





## గ్రీన్ ఎనర్జీ రంగంలో

# మహిళల భాగస్వామ్యం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ : గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన స్త్రీ సమ్మిట్ 2.0 – 2025 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన .. మహిళల హక్కులు, భద్రత, అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి తేదీలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. అంబేద్కర్ మహిళలకు అనేక హక్కులు కల్పించారని, మహిళలను శక్తిగా, దేవతగా కొలిచే గొప్ప సంస్కృతి మన దేశానికి ఉందని తెలిపారు.
మహిళల హక్కుల కోసం పార్లమెంట్‌లో అనేక బిల్లులు రూపొందించబడ్డాయని, ఈ దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగాలని ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా సంవత్సరానికి రూ. 21,000 కోట్లు విలువైన వడ్డీ లేని రుణాలు మహిళలకు అందుతుండటం విశేషమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనేది మా ప్రభుత్వ లక్ష్యమని అని స్పష్టం చేశారు. అంతేకాకుండా.. గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నామని, 1000 మెగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ ఉత్పత్తికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ తో కలిసి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా శక్తి క్యాంటీన్స్, ఆర్టీసీతో కలిసి మహిళలు భాగస్వామ్యం అవడం, స్థానిక సంస్థలలో 33% రిజర్వేషన్లు వంటి పలు చర్యల ద్వారా మహిళలు తమ పాదాలపై నిలబడేందుకు అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం మహిళలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి పూర్తిగా కట్టుబడి ఉంది" అని తెలిపారు.



## కరీంనగర్లో .. నారాయణ పక్షి

హైదరాబాద్: అరుదైన జాతికి చెందిన నారాయణ పక్షి సోమవారం కరీంనగర్ లో కనిపించింది. నలుపు, బూడిద రంగు రెక్కలు, పొడవాటి కాళ్లు, ముక్కు ఉన్న ఈ పక్షి యూరప్, ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ఎక్కువగా కనిపిస్తుందని జంతుశాస్త్ర నిపుణులు పేర్కొన్నారు. సాధారణంగా ఇవి చిత్తడి నేలలు, నదులు, సరస్సుల తీర ప్రాంతాల్లో నివసిస్తాయని తెలిపారు. వ్యవహారికంగా నారాయణ పక్షిగా పిలిచే ఈ పక్షి శాస్త్రీయనామం ఆర్డియా సినిరియా అని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి కిర్మణయి వెల్లడించారు.



## అన్ని ఊహాగానాలే..

### కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనేలా పనిచేశా

### కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి

హైదరాబాద్: జిల్లాలో దశాబ్దకాలం ఒంటరిగా పోరాటం చేశానని, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి.. అనే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని జీవన్ రెడ్డి చెప్పారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలేనని కొట్టిపారేశారు. కాంగ్రెస్‌లో వీహెచ్ తర్వాత నేనే సీనియర్‌ను. జానారెడ్డి కూడా నాకంటే నాలుగేళ్ల తర్వాత వచ్చారు. పార్టీలో సీనియార్టీకి స్థానం ఏమిటనే బాధ నాలో ఉంది. కొందరు సీనియర్లు వారి అభిప్రాయాలతో మాట్లాడి ఉండొచ్చు అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



## కొనసాగుతున్న సీఎల్పీ భేటీ

హైదరాబాద్: సీఎల్పీ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగుతోంది. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చ జరుగుతోంది. భూభారతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ వర్గీకరణ అంశాలతోపాటు ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విషయంపై నేతలు చర్చిస్తున్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలు, సలహాలను ఈ భేటీలో తీసుకోనున్నారు. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు.



## రాష్ట్ర విపత్తుగా వడదెబ్బ

### ప్రభుత్వం నిర్ణయం

### మరణిస్తే రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్ : రాష్ట్ర విపత్తుగా వడదెబ్బను పరిగణిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాని ప్రభావంతో గురై మరణించిన వారికుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇంతకుముందు వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు 50 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా మాత్రమే అందుతోంది. ఇప్పుడు రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద ఆ మొత్తాన్ని రూ.50 వేలు నుండి రూ.4 లక్షలకి పెంచుతూ ఉత్తర్వులు



జారీ చేసింది ప్రభుత్వం. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వడగాలుల ప్రభావం నుంచి రక్షించుకోవడానికి స్థానిక అధికారులు జారీ చేసే ఆరోగ్య సూచనలను ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేసింది.